క్లుప్తంగా

ఆకట్టుకున్న ఆధ్యాత్మిక ప్రవచనం



ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తున్న డాక్టర్ పెన్నేటి స్వప్న హైందవి

విజయనగరం టౌన్: పైడితల్లిని నిత్యం పూజించి ఆమె అనుగ్రహానికి పాత్రులు కావాలని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త , రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పెన్నేటి స్వప్నహైందవి అన్నారు. స్థానిక పైడితల్లి అమ్మవారి చదురుగుడి ఆవరణలో మంగళవారం ఆధ్యాత్మిక ప్రవచనాన్ని అందించారు. అనంతరం ఆమెను ఈఓ ప్రసాదరావు సత్కరించారు. అలాగే చిన్నారుల కోలాటం ప్రదర్శన కూడా అలరించింది. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పఠనాభిలాషను అలవర్చుకోవాలి



పుస్తకాలను అందజేస్తున్న సహజ సాంస్కృతిక సంస్థ ప్రతినిధులు ఎన్‌కె.బాబు, తదితరులు

విజయనగరం టౌన్: ప్రజలు పఠనాభిలాషను అలవర్చుకోవాలని సహజ సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు ఎన్‌కే బాబు తెలిపారు. నగరంలోని గురజాడ స్వగృహంలో మంగళవారం ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజలకు ఉచితంగాపుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ జక్కు రామకృష్ణ, పప్పు భోగారావు, కర్రి సత్యనారాయణమూర్తి, గురజాడ ఇందిరప్రసాద్, నల్ల యోగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

విజయనగరం టౌన్: రోటరీక్లబ్ ఆధ్వర్యంలో స్థానిక మయూరా హోటల్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని నగర కమిషనర్ మల్లయ్యనాయుడు మంగళవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోటరీ ప్రధానక్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ కృష్ణకాంతి ఆధ్వర్యంలో వందలాది మందికి మజ్జిగ అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రోటరీ కమ్యూనిటీ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ కె.తిరుమలప్రసాద్, క్లబ్ కార్యదర్శి నీతూవిజ్వానీ, తదితరులు పాల్గొన్నారు.

నేత్రవైద్య శిబిరం రేపు

జామి: మండలంలోని బలరాంపురం గ్రామంలో గురువారం ఉచితనేత్ర వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు భార్గవ్ హెల్ప్ లైన్ వ్యవస్థాపకుడు కె.వి.రమణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. భార్గవ్ హెల్ప్ లైన్ ఆధ్వర్యంలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలవరకు నిర్వహించే ఈ శిబిరంలో విజయనగరం వెంకటరామ ఆస్పత్రి సిబ్బంది సేవలందిస్తారని పేర్కొన్నారు. నేత్రసమస్యలు ఉన్న వారు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అనాథకు అంత్యక్రియలు



అనాథ శవానికి అంత్యక్రియలు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

కొత్తవలస: స్థానిక సంతమార్కెట్‌లో మృతి చెందిన అనాథకు కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి సహకారంతో శానిటరీ మేస్త్రి ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళ వారం అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడు కొద్దికాలంగా కొత్తవలస సెంటర్‌లో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. సోమవారం ఆరోగ్యం బాగోక కోటపాడు రోడ్డులో ఒక షాపు వద్ద అపస్మారక స్థితికి చేరుకోవడంతో వైద్యం చేయించి సంతమార్కెట్‌లోని ఓషెడ్‌లో పడుకోబెట్టామని, మంగళవారం మృతి చెందాడని శానిటరీ మేస్త్రి ప్రసాద్ చెప్పారు.ఈ మేరకు పోలీస్‌లకు సమాచారం అందించగా వారి సమక్షంలో శవపంచనామా చేసి అంత్యక్రియలు నిర్వహించారు.

జగన్ మోహన్‌రెడ్డికి అండగా నిలవండి..

- వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసులనాయుడు

చీపురుపల్లి రూరల్: సంక్షేమ పాలన అందించిన జగన్ మోహన్‌రెడ్డికి ప్రజలందరూ అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసులనాయుడు అన్నారు. చీపురుపల్లి పట్టణంలోని కొత్త గవిడివీధిలో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి మంగళవారం ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో జగన్ మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు అండగా నిలిచి ఆదుకున్నారన్నారు. అటువంటి వ్యక్తిని ఆదరించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని చెప్పారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా బొత్స సత్యనారాయణను, ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ను గెలిపించాలని కోరారు.

'సిద్ధం' బస్సుయాత్రకు ఘన స్వాగతం

- ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి జేజేలు పలికిన అభిమానులు
- మోదవలస వద్ద జిల్లాలోకి ప్రవేశించిన యాత్ర
- యాత్రకు మద్దతుగా యువకుల బైక్ ర్యాలీ



ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి



యాత్రకు సంఘీభావంగా మోటార్‌సైకిల్ ర్యాలీ

పూసపాటిరేగ: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పయనింపజేస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి జిల్లా ప్రజలు ఘన స్వాగతం పలికారు. మేమంతా సిద్ధం బస్సు యాత్ర జిల్లా ముఖద్వారమైన డెంకాడ మండలం మోదవలస వద్ద మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో జిల్లాలోకి ప్రవేశించింది. తగరపువలస అమలోద్భవి హోటల్ నుంచి వందలాది మంది అభిమానులు మోటార్ సైకిళ్లతో ర్యాలీగా యాత్రతో పాటు వచ్చారు. గ్రామాల ముఖ్య కూడళ్ల వద్ద మహిళలు హారతులతో జగన్ మోహన్ రెడ్డిని దీవించారు. యువత కాంగో డప్పుడల వాయిద్యాలకు నృత్యాలు చేస్తూ జగనన్నకు సంఘీభావం తెలిపారు. తనను చూడడానికి వచ్చిన అభిమానులకు బస్సు నుంచి సీఎం జగన్ మోహన్‌రెడ్డి అభివాదం చేస్తూ ముందుకు సాగారు. రాజాపులోవ జంక్షన్, మోదవలస, జొన్నాడ మీదుగా యాత్ర సాగింది. చింతలవలస ఏపీఎస్పీ క్వార్టర్స్ సమీపంలో గల ప్రెసిడెన్సీ గ్రాండ్‌లో సీఎం మధ్యాహ్నం బస చేశారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితో పాటు బస్సుయాత్రలో ఉత్తరాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, నెల్లిమర్ల ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడులు, జోన్-1 ఐటీ వింగ్ ఇన్‌చార్జ్ బడ్డుకొండ మణిదీప్ నాయుడు, బడ్డుకొండ ప్రదీప్‌నాయుడు, ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, ఉప్పాడ శివారెడ్డి, బంటుపల్లి వాసుదేవరావు, తదితరులున్నారు.



ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని చూసేందుకు పోటెత్తిన అభిమానులు



యాత్రలో పాల్గొన్న దివ్యాంగులు

దివ్యాంగుల మద్దతు

జొన్నాడ చేరుకున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి దివ్యాంగులు మద్దతు తెలిపారు . దివ్యాంగుల జీవితాలలో జగనన్న వెలుగులు నింపారని.. మరోసారి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వెలుబుచ్చారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా యువత, చిన్నారులు యాత్రలో పాల్గొనడం విశేషం.

500 మంది యువకుల బైక్ ర్యాలీ..

భోగాపురం: హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ శివారెడ్డి ఆధ్వర్యంలో సుమారు 500 మంది యువకులు బైక్ ర్యాలీ చేపట్టారు. బస్సు యాత్ర రాజాపులోవ జంక్షన్ వద్దకు చేరుకోగానే జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, బడ్డుకొండ మణిదీప్‌నాయుడు, ఉప్పాడ శివారెడ్డి, సీఎం జగన్ మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో కేవీపీ సూర్యనారాయణరాజు (పులిరాజు), అవనాపు విక్రమ్‌భావన, బంటుపల్లి వాసుదేవరావు, బైరెడ్డి ఎర్రప్పలనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అభిమానులతో కిక్కిరిసిన కొప్పెర్ల



కొప్పెర్ల వద్ద జన సమూహం



ప్రజలకు నమస్కారం చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి

పూసపాటిరేగ/డెంకాడ/నెల్లిమర్ల/నెల్లిమర్ల రూరల్/భోగాపురం/వంగర/విజయనగరం టౌన్: వైఎస్సార్‌సీపీ అభిమానులతో పూసపాటిరేగ మండలం కొప్పెర్ల కిక్కిరిసింది. చంపావతి నది వంతెన నుంచి పాత కొప్పెర్ల శివారు వరకు జాతీయరహదారిపై జనాలు బారులుతీరారు. అభిమాన నాయకుడికి మహిళలు హారతులిచ్చి, దిష్టి గుమ్మడికాయలతో దిష్టి తీయడానికి పోటీపడ్డారు. బస్సులు, లారీల పైకి ఎక్కి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని తనివి తీరా చూసుకున్నారు. జగన్ మోహన్‌రెడ్డి బస్సుపై నుంచి అభివాదం చేస్తూ నేనున్నానంటూ.. భరోసా కల్పించడంతో వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తలు, యువత, మహిళల్లో నూతనోత్తేజం వచ్చింది. మంగళవారం రాత్రి 7.30 గంటల సమయంలో కొప్పెర్లలో సిద్ధం బస్సుయాత్ర సాగింది. జగన్ మోహన్‌రెడ్డి వెంటే మేమంతా అంటూ యువత నినాదాలు చేశారు. బస్సుయాత్ర పూసపాటిరేగ, సీహెచ్ అగ్రహారం, మైలాన్ జంక్షన్, గైతులచోడవరం, కనిమెట్ట, జీఆర్‌పాలెం, కందివలస జంక్షన్, అల్లాడపాలెం జంక్షన్ మీదుగా శ్రీకాకుళం జిల్లాలోకి ప్రవేశించింది. బస్సుయాత్రలో వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ విజయనగరం జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, నెల్లిమర్ల ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి కందుల రఘుబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు పతివాడ అప్పలనాయుడు, మహంతి కల్యాణి, మహంతి సీతాలక్ష్మి, మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్ధనరావు, ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, బంటుపల్లి వాసుదేవరావు, అంబళ్ల శ్రీరాములనాయుడు, చనుమల్ల వెంకటరమణ, అల్లాడ రమేష్, బడ్డుకొండ ప్రదీప్‌నాయుడు, బడ్డుకొండ మణిదీప్ నాయుడు, ఎస్. సత్యనారాయణరాజు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలన మళ్లీ కావాలి



జగనన్న పాలన యువతరం కోరుకుంటోంది. పెద్ద సంఖ్యలో యువకులు మా గ్రామం నుంచి సభకు తరలివచ్చాం. ఇంటింటికీ సుపరిపాలన అందించడంతోపాటు ఒక్క రూపాయి కూడా లంచం లేకుండా పాలన సాగిస్తున్న జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటాం.

– నడగల సురేష్, అమటాం గ్రామం, భోగాపురం మండలం

ఆరోగ్యశ్రీతో 20 మందికి ప్రాణం పోశారు



మా గ్రామంలో 20 మందికి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకంతో ప్రాణం పోశారు. కేన్సర్, కిడ్నీ వ్యాధులతో బాధపడుతూ చావుబతుకుల్లో ఉన్న మా గ్రామ ప్రజలను ప్రభుత్వం ఆదుకుంది. ఒక్కొక్కరి వైద్యఖర్చులకు రూ.2 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు వెచ్చించింది. పేదలకు మేలుచేసే ఇలాంటి ముఖ్యమంత్రిని ఎన్నడూ చూడలేదు.

– కిలపర్తి శ్రీరాంమూర్తి, సర్పంచ్, పెదమదుపాద గ్రామం, గంట్యాడ మండలం, విజయనగరం జిల్లా

ఆరోగ్యశ్రీ కింద ఉచిత చికిత్స



నా కుమార్తె దారపురెడ్డి చంద్రకళ దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతోంది. వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం ఆర్థిక పరమితి రూ.5లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచడంతో విశాఖపట్నంలో ఉచితంగా చికిత్స పొందుతోంది. ప్రభుత్వం ఆదుకోకపోతే రోడ్డున పడేవాళ్లం. నా జీవితమంతా జగనన్నకు రుణపడి ఉంటాం.

– దారపురెడ్డి వెంకటరావు, పెదమదుపాద గ్రామం, గంట్యాడ మండలం

పేదల సంక్షేమానికి పెద్దపీట



ముఖ్యమంత్రి జగనన్న పేదల సంక్షేమానికి పెద్దపీట వేశారు. బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచారు. ఎంతో అభిమానంతో ఈ సభకు మా గ్రామం నుంచి తరలి వచ్చాం. ప్రతీ ఆడపడుచు గుర్తుపెట్టుకునేలా జగన్న పాలన ఉంది. ఆయనకు మరెవరూ సాటి లేరు.

– సారిక లక్ష్మి, కంటకాపల్లి, కొత్తవలస మండలం, విజయనగరం జిల్లా

పేదల ప్రభుత్వం ఇది



వైఎస్సార్‌సీపీ పేదల ప్రభుత్వం. ఏ ఒక్క నాయకుడు చేయలేని పనులు జగన్‌మోహన్‌రెడ్డి చేసి చూపించారు. డప్పు కళాకారుడి పెన్షన్ మంజూరు చేశారు. సెంటు భూమి లేని నిరుపేదను నేను. పింఛన్‌తో ఆదుకున్నారు.

– కోట సన్నిబాబు, వృద్ధుడు, కిర్ల గ్రామం, జామి మండలం, విజయనగరం జిల్లా.

పేదలకు అండగా జగన్ ప్రభుత్వం



పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి జగన్ ప్రభుత్వం అండగా నిలిచింది. పేదలకు మేలు జరిగింది. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న నాలుగు పోర్టులు అభివృద్ధి చెందితే వేలాదిమందికి ఉద్యోగాలు లభిస్తాయి. రూ.లక్షల కోట్లు పెట్టుబడులు వస్తున్నాయి. విశాఖపట్నం రాజధాని అయితే రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తుంది. జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలు స్ఫూర్తిదాయకం.

– కోదూరు కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ కన్వీనర్, అమెరికా

నవరత్నాలతో మేలు....



జగనన్న ప్రభుత్వం నవరత్న పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసింది. అందుకే అంతా జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరుకుంటున్నాం. ఏ రాష్ట్రంలో లేని విధంగా జగనన్న పాలన ఉంది. నిరుపేద కుటుంబానికి చెందిన మాకు ఇంటి స్థలం మంజూరు చేసి ఆదుకున్నారు.

– అంధవరపు రాణి, రాజీవ్‌నగర్, విజయనగరం

మహిళల భవితకు బాసట



జగనన్న ప్రభుత్వం మహిళల అభివృద్ధికి బాసటగా నిలిచింది. నిరుపేద కుటుంబానికి చెందిన మాకు ఏటా వైఎస్సార్ చేయూత కింద రూ.18,750 ఆర్థిక సాయం అందిస్తున్నారు. చిరువ్యాపారాలకు తోడ్పాటునందిస్తున్నారు. జగనన్న కాలనీలో ఇంటి స్థలం మంజూరు చేశారు.

– కొయ్యాపు లక్ష్మి, గాంధీనగరం కాలనీ, నెల్లిమర్ల, విజయనగరం జిల్లా

ఆత్మస్థైర్యాన్ని నింపారు



బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న చిన్నారి చైత్యన్యను తీసుకువచ్చిన తల్లిదండ్రులు

నా పేరు ముదిల ఉమా మహేష్. విజయనగరంలోని అయ్యన్నపేట. నా కుమారుడు చైతన్యకు నాలుగు సంవత్సరాలు. బ్లడ్ క్యాన్సర్‌తో పోరాడుతున్నాడు. చికిత్స కోసం రూ.30 లక్షలు ఖర్చవుతుందని చైన్నైలో డాక్టర్లు చెప్పారు. ఆటో డ్రైవర్ గా జీవనం సాగిస్తున్న తనకు చికిత్స చేయించేందుకు అంత ఆర్థిక స్తోమత లేదు. జగనన్న మమ్మల్ని చూసి దగ్గరకి పిలిపించారు. సమస్యను చెప్పగానే చికిత్స చేయిస్తామని భరోసా కల్పించి మాలో ఆత్మస్థైర్యాన్ని నింపారు.

భరోసా కల్పించారు



వీల్ చైర్‌లో కుమారుడు ప్రణయ్‌ను తీసుకువచ్చిన మహిళ

మాది విజయనగరంలోని దాసన్నపేట. మా బాబు కారి ప్రణయ్ పుట్టుకతోనే అంగవైకల్యం , అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. జీవితాంతం వీల్ చైర్‌లోనే జీవితం గడుస్తోంది. నాకు జగనన్న ప్రభుత్వం హయాంలోనే పింఛన్ మంజూరైంది. బాబు ఆరోగ్య సమస్యను సీఎంకు వివరించాను. ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. జగనన్న చెప్పారంటే సమస్య దాదాపు పరిష్కారం అయినట్టే.

– కారి విమలశ్రీ,, దాసన్నపేట

చంద్రబాబును జనం నమ్మరు



గ్రామ వలంటీర్లు అందిస్తున్న సేవలను అడ్డుకున్న చంద్రబాబును ప్రజలు నమ్మరు. ఒకటో తేదీన మా వంటి వృద్ధులకు ఇంటి వద్దనే పింఛన్ అందించేవారు. చంద్రబాబు కుట్రవల్ల సచివాలయాలకు వెళ్లాల్సివస్తోంది. వలంటీర్ వ్యవస్థ మళ్లీ అందుబాటులోకి రావాలంటే జగనే గెలవాలి. అందుకే ఆయనకే ఓటు వేస్తాను.

– లెంక రాము, ఆకులపేట, డెంకాడ మండలం, విజయనగరం జిల్లా

నా బిడ్డకే నా ఓటు



నా బిడ్డ జగన్ బాబుకే నా ఓటు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నప్పటికీ జగన్‌బాబును చూడడానికి బస్సులో వచ్చాను. అందరికీ మంచి పని చేసిన నా బిడ్డకు అండగా నిలవాలన్నదే నా ఉద్దేశం. నా బిడ్డను ఆశీర్వదించాలని అందరినీ కోరుతున్నా.

– పెనుమజ్జి వరహాలమ్మ, కందిపేట, గరివిడి మండలం

• అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓ సూర్యనారాయణ, తదితరులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ ఆదర్శ పాఠశాలలో పదో తరగతి జిల్లా టాపర్లను ఎంఈఓ సూర్యనారాయణ మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆదర్శ పాఠశాల విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఎలక్షన్ డీటీ మూర్తి విద్యార్థులకు నగదు బహుమతులు అందించి ప్రోత్సహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఇందిరా ప్రియదర్శిని పాల్గొన్నారు.

ఘనంగా ఆంగ్లభాషా దినోత్సవం

లక్కవరపుకోట: మండలంలోని కొట్యాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ టీచర్లు ఉమామహేశ్వరరావు,గుమ్మడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆంగ్ల భాషా దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రపంచ ప్రఖ్యాత ఆంగ్ల కవి, నాటక రచయిత విలియం షేక్‌స్పియర్ జన్మదినం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆంగ్ల సాహిత్యానికి షేక్ స్పియర్ చేసిన సేవలను ఉపాధ్యాయులు కొనియాడారు. విద్యార్థులకు పోయమ్స్,సంభాషణలు, స్టోరీ టెల్లింగ్, జీవిత కథలు, ఆంగ్లవ్యాకరణం,క్విజ్ తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఆంగ్ల భాషపై పట్టుసాధిస్తే జీవితంలో ఉన్నత స్థానంలో స్థిరపడే అవకాశం ఉంటుందని అన్నారు. హెచ్ఎం పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ పుస్తక దినోత్సవం

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ప్రపంచ పుస్తక, కాపీ రై ట్స్ దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. అతిథిగా హాజరైన వైస్ ప్రిన్సిపాల్ కె.వాసు దేవరావు పుస్తకపఠనం ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. కామర్స్ విభాగాధిపతి డాక్టర్ జి.ఈరన్న, అధ్యాపకులు డాక్టర్ సుధీర్, జి.సురేష్, డి.లక్ష్మణ్ పాల్గొన్నారు.

బీజేపీది నియంత పాలన

- కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి బొబ్బిలి శ్రీను

విజయనగరం ఫోర్ట్: బీజేపీ నియంత పాలనకు చరమగీతం పాడాలంటే కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి బొబ్బిలి శ్రీను అన్నారు. విజయనగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అధికారం కోసం బీజేపీ అడ్డదారులు తొక్కుతోందని ఆరోపించారు. జిల్లా సమస్యలను ప్రస్తావించడానికి పార్లమెంట్ మంచి వేదిక అని అన్నారు. తనకు ఒక అవకాశం ఇస్తే జిల్లా సమస్యలపై పార్లమెంట్‌లో గళం వినిపిస్తానన్నారు. రాష్ట్రంలో రాజన్న పాలన రావాలంటే షర్మిల నాయకత్వాన్ని బలపరచాలని తెలిపారు. ఈ నెల 24న ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ వేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కామేశ్వరరావు, అశోక్, సీపీఎం నాయకులు సూర్యనారాయణ, రమణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు జమ్ము ఆదినారాయణ, డోల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

కొత్తవలస: ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మంగళపాలెం గ్రామంలో కొత్తవలస పీహెచ్‌సీ వైద్యాధికారి సీతల్ వర్మ ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు సీతల్‌వర్మతో పాటు గైనకాలజిస్టు పి.వరలక్ష్మి, ఆప్తాలమిక్ జ్యోతిప్రియ శిబిరంలో 365 మందికి సేవలందించారు. ఇద్దరిని నేత్ర శస్త్రచికిత్సలకు ఎంపిక చేసి విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

పుష్పాలంకరణలో పైడితల్లి



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



ఆలయ ప్రాంతంలో చండీహోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంతంలో చండీహోమం నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

ప్రజలందరిపై అమ్మ ఆశీస్సులు

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



అమ్మవారిని దర్శించుకుంటున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం టౌన్: గాజులరేగ ఇలవేల్పు ముత్యాలమ్మ ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆకాంక్షించారు. ఆలయ వార్షిక మహోత్సవాల్లో భాగంగా అమ్మవారిని మంగళవారం దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంప్రదాయ పద్ధతిలో వార్షికోత్సవం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు జమ్ము మధుసూదనరావు, కార్పొరేటర్ నడిపిల్లి ఆదినారాయణ, జామాన శ్రీనివాసరావు, కనుగుల రాజా, తదితరులు పాల్గొన్నారు.